**International Journal of Academic Research**
**ISSN: 2348-7666 Vol.2, Issue-3(3), July-September, 2015**
**Impact Factor: 1.855**

# తెలంగాణ నాటక సాహిత్యం

**పి. స్వప్న,** ఎం.ఏ. (తెలుగు)
తెలుగు అధ్యాపకురాలు
కెఎస్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల, నర్సంపేట
వరంగల్. సెల్ : 9848838551

పాశ్చాత్య విద్యా సంపర్కం వల్ల అవతరించిన నవల, కథానిక, వ్యాసం వంటి ప్రక్రియల్లో నాటక ప్రక్రియ కూడా తెలుగులో అవతరించింది. స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన తెలుగు రచయితలకు ఒక ఆయుధంగా నిల్చింది.

"ఈ నాటక ప్రక్రియ ప్రధానంగా మూడు రకాలైన ఇతివృత్తాలతో ఆంధ్రదేశంలో నలుదిశలా ప్రసరించింది. ఆ విధంగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక కథనాలతో కూడిన ఈ దృశ్యకావ్య ప్రక్రియ బహుళ ప్రదర్శనల ద్వారా ప్రేక్షక లోకాన్ని చైతన్యవంతం చేసింది"[1].

సాహిత్యంలో నాటక ప్రక్రియకు ఒక విశిష్ట స్థానం ఉన్నది. అందుకే "క్యావ్యేషు నాటకం రమ్యమ్ : నాటకాంతం హి సాహిత్యమ్ నాటకాంతం హి కవిత్వమ్" వంటి అభాణకాలు ఏర్పడినాయి. ఇవన్నీ సాహిత్యంలో నాటకానికి ఉన్న పరమోత్కృష్ట స్థానాన్ని తెలియజేస్తాయి.

"దుఃఖార్తాణాం శ్రమార్తాణాం శోకార్తాణం తపస్వినాం"

విశ్రాంతి జననం కాలే నాట్యమేత ద్భవిష్యతి" అని భరతుడు నాట్యశాస్త్రంలో చెప్పినట్లు దుఃఖార్తులైన వారికి, శ్రమార్తులైన వారికి, తపస్సులకు విశ్రాంతిని ప్రసాదించి మనోల్లాసాన్ని కల్గించటానికి ప్రభవించిన నాటక కళ, ఆ తరువాతికాలంలో పండితులకు, పామరులకు, శ్రమార్తులకు – సుఖాభిలాషులకు, విజ్ఞానానికి – వినోదానికి, చివరకు కాలక్షేపానికి – ఆనందాన్ని పంచి ఇచ్చే సాధనంగా మారింది. అందుకే కాళిదాస మహాకవి దానిని "నాట్యం భిన్నరుచేర్జనాస్య బహుధాప్యేకం సమారాధనమ్" అని ప్రశంసించాడు.

చరిత్రకు అందినంత వరకు తెలంగాణ ప్రాంత చరిత్ర కాకతీయులతోనే ఆరంభమైందని చెప్పవచ్చును. అంతకు పూర్వం జరిగిన అభివృద్ధికి మనకు సరియైన ఆధారాలు కనిపించవు. అట్లాగే తెలంగాణా ప్రాంతంలో జరిగిన సాహిత్య కృషి కూడా మనకు కాకతీయుల కాలం నుంచే కనిపిస్తుంది. కాకతీయ రాజులు స్వయంగా

1. తెలుగులో చారిత్రక నాటకాలు – డా॥ వెంకట రామశాస్త్రి

కవులై, కవిజన పోషకులై, చరిత్రలోను – సాహిత్య చరిత్రలోను స్థిరస్థానం సంపాదించుకొన్నారు. అట్లాగే తెలంగాణ ప్రాంతంలో జరిగిన నాటక ప్రక్రియాభివృద్ధి కూడా మనకుకాకతీయుల కాలం నుంచే కనిపిస్తుంది.

**పౌరాణిక నాటకాలు :** కాకతీయులలో కడపటి మహారాజు ప్రతాపరుద్రుడు. ఆయన స్వయంగా కవి – కవి పండిత పోషకుడు. ఆయన సంస్కృతంలో 'యయాతి చరిత్ర' అనే నాటకాన్ని వ్రాసాడు. అది కాకతీయుల కాలపు సామాజిక స్థితి గతులను కొన్నింటిని తెలుపుతున్నది. ఓరుగల్లులో ప్రభవించి జీవించివున్న మొట్టమొదటి నాటకం ఇదే. అంతేకాక – దానికి ఆచార్య కేతవరపు వెంకట రామకోటిశాస్త్రి గారు 1972లో వెలయించిన అనువాదం కూడా ఇక్కడే రావటం విశేషము. అందులో కుంద చతుర్థశి నాడు స్త్రీలు సభర్తృకలై శ్రీ గౌరీసనాథ త్రిలోచన వ్రతం చేసే వారని, గౌరీపూజ చేసి వాయనాలిచ్చేవారని, అబద్ధం చెప్పేవారికి దేశ బహిష్కర శిక్ష చేసే వారని కనిపిస్తుంది.

ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉండిన విద్యానాథుడు "ప్రతాప రుద్రీయమ్" అనే గొప్ప అలంకార శాస్త్ర గ్రంథాన్ని వ్రాసాడు. అందులోని 3వ ప్రకరణంలో నాటక లక్షణాలను సాకల్యంగా వివరించాడు. ఆ లక్షణాలకు లక్ష్యంగా "ప్రతాపరుద్ర కళ్యాణమ్" అనే 5 ఐంకాల ఒక చిన్న నాటకాన్ని కూడా వ్రాసాడు విద్యానాథుడు. అది కూడా కాకతీయుల కాలపు కొన్ని సామాజిక పరిస్థితులకు అద్దం పడుతున్నది. అంతేకాక కాకతీయుల కులదైవము శ్రీ స్వయం భూదేవుడని, ప్రతాపరుద్రునికి "చలమర్తి గండ" అనే బిరుదు ఉండేదని, కాకతీయుల అభిమాన దేవత దుర్గాదేవి అనీ,ఓరుగల్లును నాడు "ఆంధ్రనగరము" అనేవారని, ప్రతాపరుద్రుడు తన వక్షస్థలమున రాజలాంఛనమైన వరాహ ముద్రను ధరించేవాడని, కాకతీయ సామ్రాజ్యపు ఇరుగు పొరుగు దేశాల, ఆనాటి శిక్షలు వంటి అనేక సామాజిక విషయాలు చెప్పబడినాయి.

14వ శతాబ్ది పూర్వార్థంలో కాకతీయ సామ్రాజ్యం పతనమైన తరువాత, తెలంగాణలో చెప్పుకోదగిన సాహిత్య, సాంస్కృతిక పరిణామాలు ఏవీ జరగలేదనే చెప్పవచ్చును. దాదాపు 600 సంవత్సరాల తరువాత అంటే 20వ శతాబ్ది ప్రారంభం నుంచీ తెలంగాణలో సాహిత్య చైతన్యం కలిగింది.

వనపర్తి సంస్థానాధీశుల్లో ఒకరైన శ్రీ అష్టభాషా బాహిరీ గోపాలరావు గారు 17వ శతాబ్దంలో "రామ చంద్రోదయం" అనే సంస్కృత నాటకాన్ని తొలిగా రచించారు. సంస్కృతంలో ప్రౌఢ శైలిలో రచించడమే కాక సుభోదకంగా వ్యాఖ్యను కూడ రచించారు. వారిలో పౌఢ సరస్వతి అనబడే బుక్క పట్టణం. శ్రీనివసాచార్యులు, వనపర్తిలో శ్రీ హస దుర్గం కృష్ణమాచార్యులు మొదలైనవారు అనేక గ్రంథాలను, నాటకాలను రచించారు.

International Journal of Academic Research
ISSN: 2348-7666 Vol.2, Issue-3(3), July-September, 2015
Impact Factor: 1.855

శ్రీ కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం పంతులు, పరవస్తు వెంకట రంగాచార్యులు వంటి వారు ప్రసిద్ధ సంస్కృత రూపకాలను ఆంధ్రానువాదాలు రచించి కీర్తి గాంచారు. శ్రీరామచంద్ర శాస్త్రి గారి "మంజరీ మధుకరీయము" తెలుగులో తొలి నాటకం. కాని శ్రీ కొండుభట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి గారి "ప్రహ్లాద నాటకం[1]" (1881–84), హరిశ్చంద్రోపాఖ్యానం (188–84) తెలుగులో తొలి పౌరాణిక నాటకాలు[2].

19వ శతాబ్దంలో కీర్తి శేషులు మాదిరాజు విశ్వనాధ రావు గారు కాళిదాసు శాకుంతలాన్ని తెనిగించారు. విశ్వనాధ రావు గారు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి గారు కలిసి, బిల్హణుని 'కర్ణ సుందరి' అను నాటికను తెనిగించారు. ఏమైనా ఆంధ్రదేశంలో ఆనటక కళాభివృద్ధి జరిగినంత తెలంగాణాలో జరుగలేదు. ఈ శతాబ్దంలో మాత్రం కొన్ని ఉత్తమ నాటకాలు వెలువడ్డాయి. వాటిలో కీ॥శే॥ మాదిరాజు విశ్వనాధ రావు గారి ఉచ్ఛల నాటకము, కీ॥శే॥ సురవరం ప్రతాపరెడ్డి గారి "భక్త తుకారాం" ఉత్తమ శ్రేణికి చెందిన నాటకాలు[3].

ఆంధ్రదేశంలో 'హరిశ్చంద్ర నాటకం' అటే బలిజేపల్లి లక్ష్మీకాంత కవి రచించిన నాటకంగా ఇప్పటికీ ఆ నాటకం జనాదరణ పొందుతోంది. అయితే తెలంగాణా ప్రాంతంలో ఈ హరిశ్చంద్ర నాటకాన్ని విశ్వనాధ కవి రచించారు. భారతాంతర్గతమైన హరిశ్చంద్ర కథను చక్కని సందేశాత్మకంగా సత్యం యొక్క పూర్వ స్వరూపాన్ని హరిశ్చంద్రునికి అన్వయిస్తూ నాయకునిగా, ప్రేమికునిగా, ధర్మబద్ధునిగా, లక్ష్యసాధకునిగా అనేక కోణాల్లో హరిశ్చంద్ర పాత్రను అద్భుతంగా తీర్చిదిద్ది నాటకాన్ని రక్తి కట్టించారు.

శేషాద్రి రమణ కవులు 1912 సంవత్సరంలో "అర్జున పరాభవం" అన్న నాటకాన్ని రచించారు. మహారాష్ట్ర వాఙ్మయంలో గల చిత్రకథను అనుసరించి ఈ నాటకాన్ని మనోహరంగా రచించారు. పాండవుల గర్వ విజృంభణం, శ్రీకృష్ణుని కార్యకౌశలం, రాక్షసుల మాయా నటనా చాతుర్యం, భారత సంగ్రామానంతరం సంభవించిన పరిణామాలనేవి ఇందులో ప్రధానాంశాలు. ఒద్దిరాజు కవులుగా ప్రసిద్ధికెక్కిన శ్రీ ఒద్దిరాజు సీతారామ చంద్రరావు, రాఘవ రంగారావు గార్లు మోహినీ విలాసము (1912) అనే నాటకాన్ని వ్రాసారు.

శేషాద్రి రమణ కవులు రచించిన మరో నాటకం 'ఉత్తర గోగ్రహణం'. ఈ నాటకం కూడా భారతాంశమే. తిక్కన భారతంలోని విరాటపర్వంలోని భాగం. తెలుగు నుడికారంతో చక్కగా ఈ నాటకాన్ని రచించారు. 1926లో ప్రచండ భార్గవం, 1929లో దమయంతీ సంవరణం, 1929లో"పాదుకా పట్టాభిషేకం" అనే నాటకాలను రచించాడు.

1. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము –డా॥ దివాకర్ల వేంకటావధాని – పేజీ – 136
2. తెలుగు నాటక వికాసము– డా॥ పి.యస్.ఆర్. అప్పారావు – పేజీ – 192
3. ఆంధ్ర నాటక రంగ వికాసం – మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి – పేజీ – 364

"ప్రచండ భార్గవం" భవభూతి కృత "మహా వీర చరితం" నకు ఛాయానువాదమని పాద సూచికలో కవులు పేర్కొన్నారు. "ఉత్తముడు", ఆంధ్ర సామ్రాజ్యం" అన్న ఈ కవుల నాటకాలు అముద్రితం.

"గయో పాఖ్యానం" అనగానే సామాన్యంగా ఆంధ్రదేశంలో చిలకమర్తి వారి నాటకం అనే ముద్ర ప్రచారంలో ఉంది. అయితే తెలంగాణ ప్రాంతంలో పుట్టిన శ్రీ పుల్లయ్య కోట్రిక్ గారు తమదైన భావజాలంతో చిలకమర్తి వారి నాటకానికి తీసిపోని విధంగా గయోపాఖ్యాన నాటకాన్ని చక్కగా, రసవత్తరంగా తీర్చిదిద్దారు.

"తులాభారం" నాటకాన్ని తెలంగాణ ప్రాంతంలో ప్రఖ్యాతమైన రచయిత చందాల కేశవదాసు గారు ముందుగా రచిస్తే తరువాత ఇదే ప్రాంతంలో వట్టెం పాపకవి "తులాభారం" నాటకాన్ని రచించడం విశేషం. ఆంధ్రదేశంలో చందాల కేశవదాసు రచించిన "తులాభారం" నాటకం అనేక ప్రదర్శనలకు నోచుకుని అజరామరమైన కీర్తిని సంపాదించింది. ఈ నాటకంలో "భలే మంచి చౌక బేరము" అనే పాట ఆంధ్రదేశంలో ప్రతి వారి హృదయాన్ని దోచుకున్నదవడం విశేషం. అయితే తెలుగు నాటకాలకు, ప్రదర్శనలకు పెద్దపీటగా ఆంధ్ర ప్రాంతాన్ని అభివర్ణిస్తూ తెలియజేసిన అనేక మంది విద్వాంసులకు ధీటైన సమాధానంగా చందాల కేశవదాసు గారి "కృష్ణ తులాభారం" తెలంగాణ ప్రాంత విశిష్టతను శాశ్వతం చేసిందని చెప్పవచ్చు. అలాగే వట్టెం. పాపకవి గారి తులాభారం నాటకం మధుర భావములకు నెలవై శాశ్వత ధర్మాన్ని అందించేదిగా స్థిరపడిందని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

ఆధునిక తెలుగు సాంఘిక నాటకంపై ప్రామాణిక పరిశోధన చేసి పలు నిక్కచ్చి ప్రతిపాదనల్ని ముందుంచిన డాక్టర్ పి.వి. రమణ తెలంగాణ వారు. ఆయనకే కాదు ఇక్కడి నటకులందరికీ గురు స్థానాన్ని వహించేప జాయపసేనాని వరంగల్ వాసి. కొల్లాపురం కవి ఎలకూచి బాల సరస్వతి రచించినట్లుగా చెబుతున్న "రంగకౌముది" నాటకం ప్రసుతం అలభ్యం. దేశి నాటక వైభవాన్ని వర్ణించిన కావ్యాల్లో ఒకటైన "క్రీడాభిరామం" కాకతీయుల ఓరుగంటిని క్రీగంట పరిచయం చేసింది[1].

పౌరాణిక నాటక కర్తలు వారి చాతుర్యం ద్వారా ఎప్పుడో ఐతిహాసికంలో జరిగిన అంశాలను ఇతివృత్తాలుగా ఉటంకిస్తూ గడిచిపోయిన కాలాన్ని, మనషులను పాత్ర, సంఘటనలుగా మలచి ప్రదర్శనకు అందించారు. ముఖ్యంగా పౌరాణిక నాటకాలు కవుల శిల్ప తత్వానికి, ప్రతిభకు నిదర్శనంగా పాత్రోచిత సంభాషణలతో, సంఘటనలతో మలచబడి ప్రజాభిమానాన్ని నాడే గాక నేటికీ చూరగొనడం మనం గమనించవచ్చు.

**చారిత్రక నాటకాలు :** తెలంగాణాలో వెలసిన మొదటి చారిత్రక నాటకము 13వ శతాబ్దంలో వెలసిన విద్యానాదుని ప్రతాపరుద్ర కల్యాణమే. ఆ తరువాత 20వ శతాబ్దం వరకూ లేవనే చెప్పవచ్చు. 1929 ఏప్రియల్

'సుజాత' పత్రికలో ప్రచురింపబడిన 'పాదుకాపట్టాభిషేకము' శేషాద్రి రమణకవులు వ్రాసినది. ఛత్రపతి శివాజీ గురువైన సమర్థ రామదాసు జీవిత చరిత్రను 'దాసబోధ' అనే గ్రంథంగా వెలయించారు శేషాద్రి రమణకవులు. పాదుకా పట్టాభిషేక నాటకానికి మూలం దాసబోధే. శివాజీ సతారా ప్రభువుగా ఉన్న రోజులలో, ఆయన గురువైన సమర్థరామదాసు మాత్రం సన్యాస జీవనమే గడుపసాగాడు. ఒకరోజు ఆయన శిష్యులు భిక్షాటన చేస్తూ శివాజీ వద్దకు వెళ్తారు. శివాజీ తన రాజ్యాన్నంతటినీ దానం చేస్తున్నట్లు ఒక చీటీ మీద వ్రాసి వారి జోలెలో వేస్తాడు. సర్వసంగ పరిత్యాగం చేసిన తమకు రాజ్యమెందుకని చెప్పి, తిరిగి శివాజీనే దానికి అధికారిగా నియమిస్తాడు సమర్థ రామదాసు. శివాజీ మహారాజు గురుభక్తిని, సమర్థ రామదాసు శిష్యవాత్సల్యాన్ని చాటిచెప్పేది ఈ పాదుకా పట్టాభిషేక నాటకము. బొబ్బిలి సింహం అయిన తాండ్రపాపారాయని ఇతివృత్తంగా చేసికొని శేషాద్రి రమణకవులు వ్రాసిన 'పాపారాయ నిర్యాణం' నాటకం 1915లోనే వచ్చింది.

దాశరథి కృష్ణమాచార్యులు రచించిన మరొక చారిత్రక నాటకము 'ఏకశిల' ఏకశిలా నగరం రాజధానిగా సువిశాలమైన ఆంధ్ర సామ్రాజ్యాన్ని పాలించిన కాకతీయులలో రుద్రమదేవి ప్రసిద్ధురాలు. ఆమె భర్త వీరభద్రదేవుడు. స్త్రీ పరిపాలన నచ్చని వీరభద్రదేవుడు ఆమె పాలనను ధిక్కరించి, యాదవ రాజులతో కలిసి ఓరుగల్లు మీద దండెత్తుతాడు. రుద్రమదేవి తన పరాక్రమాన్ని ప్రదర్శించి, దేశకల్యాణం కోసం తన భర్తనే సంహరించడం ఇందలి ఇతివృత్తం.

దాశరథి వ్రాసిన మరొక నాటకం 'మహాబోధి" 1956లో స్రవంతి పత్రికలో ప్రచురింపబడింది. విశ్వశాంతి కోసం బుద్ధుడు అనుభవించిన ఆవేదన ఇందులోని ఇతివృత్తం[1].

దాశరథి రచించిన మరొక నాటకము "గోలుకొండ" తాను ప్రేమించిన సామాన్య స్త్రీ సాంలీకోసం రాజ్యత్యాగమే చేసిన సుల్తాన్ అమరగాథ ఇందులోని ఇతివృత్తము.

ఈ తెలంగాణా ప్రాంతంలో వ్రాయబడకపోయినా, ఈ ప్రాంతపు వీరుని చరిత్రను ఇతివృత్తంగా తీసుకొని డా॥ పంపన సూర్యనారాయణ గారు వ్రాసిన "సర్దార్ పాపన్న" నాటకం 1988లో వచ్చింది. వరంగల్ జిల్లాలోని ఖిలాషాపురంలో దుర్గాన్ని నిర్మించుకొని, గోలుకొండ నవాబును జయించి, ఏడు ఘడియలు గోలుకొండ సింహాసనమధిష్టించిన సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఇందులోని ఇతివృత్తము.

**సాంఘిక నాటకాలు :** సంఘంలోని వ్యక్తులను గురించి,సమస్యలను గురించి, హక్కులు, బాధ్యతలను గురించి ఒకటని కాకుండా సంఘానికి చెందిన అన్ని విషయాలను తనలో ఇముడ్చుకున్న పదం సాంఘికం. ఒక

వర్గానికి చెందిన కొన్ని జీవులతో ఏర్పడేది సంఘం. ముఖ్యంగా మానవ జాతి జీవితం మొత్తం సంఘంతోనే ముడిపడి ఉంది. మానవ సంఘం కొన్ని నిర్దిష్టమైన విలువలనూ, సంస్కృతినీ కలిగి ఉంది. పశు పక్ష్యాదులకు లేని సాంఘిక పరమైన ఎన్నో బాధ్యతలను మనం విధిగా నిర్వహించి దాని వల్ల సంఘం ద్వారా లభించే కీర్తి ప్రతిష్టలను, సాంఘిక పరమైన భద్రతను పొందుతున్నాం.

పౌరాణిక, చారిత్రక నాటక రచనలనే గాక, సమకాలీన సమస్యలు ప్రస్తావించే సాంఘిక నాటక రచనను కూడా శేషాద్రి రమణ కవులు చేపట్టారు. "సమాజం కొత్త ధోరణిలో రూపం దిద్దుకొన్నప్పుడు రంగస్థమూ, అందుకనుగుణమైన పరిణామం చెందాలి" అంటాడు. ఫ్రాంకోయిస్ రోయిస్ అంటే సమకాలీన జన జీవనాన్ని, మానవ గమనాన్ని నాటకం తేట తెల్లం చేయగలగాలి.

"విచిత్ర వివాహం" అనే నాటకాన్ని 1935లో శేషాద్రి రమణ కవులు రచించారు. ఆనాటి సంక్షుభిత సమాజంలోని అనేక భయానక సమస్యల ప్రాతిపదికగా ఈ నాటక రచన చేశారు. పాత విలువలు హరించుకొని పోయి నాగరికత పేర కమ్ముకొచ్చిన డాంబిక కుహనా పోకడలు సమాజాన్ని ఎంతగా నిర్జీవం చేస్తాయో, మానవుల్ని ఎంతగా దిగజార్చి వేస్తాయో తెలియజేస్తుందీ నాటకం[1]. ఒక అబ్బాయికి అమ్మాయి వేషం వేయించి, వివాహం జరిపి, తద్వారా వేషాలు మార్చే ఒక నిత్య పెళ్ళికొడుకును పోలీసులకు అప్పగిస్తారు. ఆ తరువాత ఆ అమ్మాయిని ఆమె ప్రేమించిన అబ్బాయికే ఇచ్చి వివాహం చేస్తారు. వితంతు వివాహాలను సమర్థిస్తూ 'సుశీల', 'చంద్రరేఖ' అనే మరొక రెండు నాటకాలు కూడా వ్రాసారు శేషాద్రి రమణకవులు.

"తెలంగాణ ఆధుఇనక మార్గ నాటకానికి నారు పోసి, నీరు పోసి పెంచిన జిల్లా నల్లగొండ. కోదాటి లక్ష్మీనరసింహాచార్యులను తెలంగాణ మార్గ నాటక రంగ సారధిగా, మరో ఆత్రేయగా పేర్కొనవచ్చు. నల్లగొండ జిల్లా మొత్తం మీద సముచిత స్థాయి నాటక వాతావరణాన్ని విప్పారజేసిన కళాజీవి కె.ఎల్. నరసింహారావు. వివిధ కాలమాన పరిస్థితులు, సామాజిక పరిణామాల్ని మదింపు చేస్తూ తనదైన రీతిలో ఆయన రచించిన "ఆదర్శ లోకాలు, అడుగు జాడలు, కొత్తగుడి, క్రీనీలు" నాటకాలు కొత్త తరానికి ప్రోత్సాహాన్ని అందించాయి[2].

చిల్లర భావ నారాయణ గారు "కళాభిమాని", "దేశద్రోహం", "ఉప్పెన", "కామందు", పరిణామం", కొత్త మనిషి" పదవులు – పెదవులు' అనే నాటకాలను వ్రాసారు. ఎ.ఆర్.కృష్ణ "అరగంటలో అదృష్టం' ఎక్కడికి, కల్లోలం, దేశం కోసం చేసిన నేరం నాటకాలను వ్రాసారు. భాగి, నారాయణ మూర్తి గారు పరీక్ష చదువు, డాక్టరు యజ్ఞం అనే రెండు ఉత్తమ నాటకాలు రచించారు.

International Journal of Academic Research
ISSN: 2348-7666 Vol.2, Issue-3(3), July-September, 2015
Impact Factor: 1.855

సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ నాటకానికి ప్రముఖ స్థానం. అది దృశ్య కావ్యం. దేశ జనాభాలో అధిక శాతం నిరక్షరాస్యులుగా ఉన్న మన భారతదేశంలో నాటకం ప్రజా జీవితాన్ని ఎక్కువగా ప్రభావితం చేయగలదు. ప్రజా చైతన్యాన్ని కలిగించగలదు. ఒకవైపు గాంధీజీ స్వాతంత్రోద్యమం, మరోవైపు ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం., ఇంకోవైపు తెలంగాణా పోరాటం. వీటి నేపథ్యంతో నాటి నాటకాలు వచ్చాయి. తెలంగాణ పోరాటం గొప్ప స్ఫూర్తి గల ఉద్యమం. ఆ ప్రజా ఉద్యమం నాటకాన్ని అనేక రకాలుగా చైతన్యవంతం చేసి ప్రజావాహినిని ముందుకు నడిపింది[1].

1943లో ప్రజా నాట్యమండలి స్థాపించబడింది. మండలి అభ్యుదయకర పోకడలను బలపరుస్తుంది. ఈ మండలియే ప్రజా నాట్య మండలిగా అవతరించింది. సమాజ స్వరూపాన్ని మార్చగల ప్రజా కళారూపాలను ప్రజా నాట్య మండలి ప్రజలకు అందించింది.

ప్రజా నాట్య మండలి ప్రదర్శించిన మూడవ నాటకం "మా భూమి". "మా భూమి" నాటక రచయితలు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి, భాస్కరరావు. ఈ నాటకాన్ని 128 దళాలు, 980 ప్రదర్శనలు ఇచ్చాయి. ప్రజా నాట్యమండలి వారు "మా భూమి" నాటకాన్ని బొంబాయి, పూనా, షోలాపూర్ మొదలైన పెద్ద పెద్ద పట్టణాలతో పాటు పల్లెల్లో కూడ ప్రదర్శించారు. 1947లో ఇది రచింపబడ్డది.

తెలంగాణ పోరాటానికి సంబంధించిన వెట్టి, అక్రమ వసూళ్ళు, లెవీ, స్త్రీలపై పీడన మొదలైన అన్ని సమస్యలు దీనిలో చర్చింపబడ్డాయి. తెలంగాణ ప్రజల జీవన సమస్య అయిన భూమి సమస్యను ఈ 'మా భూమి' నాటకం సమగ్రంగా చిత్రించింది.

వైజ్ఞానిక ఉద్యమంగా ప్రారంభమైన ఈ తెలంగాణ విమోచనోద్యమం, పోరాటంగా పర్యవసించింది. జనం సంఘటితమవుతూ ఉద్యమాన్ని ముందుకు నడిపారు. తొలి దశలో ఇది సంస్కరణోద్యమంగానే నడిచింది. తెలంగాణ ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థను ప్రతి ఫలిస్తూ తెలంగాణ పోరాట చరిత్రకు సాహిత్య కళారూపాలుగా వచ్చిన ఈ నాటకాలు, నాటికలలో నాటకాలను (1) తెలంగాణ పోరాట ప్రతినిధి నాటకం (మా భూమి) (2) తెలంగాణ దేశీయవాతావరణం లోపించిన నాటకం (పోతు గడ్డ) (3) పోరాట ఆశయాల్ని ఉజ్వలంగా చిత్రిస్తూ వచ్చిన నాటకం (గెరిల్లా)గా వర్గీకరించవచ్చు.

తిరునగిరి, రామాంజనేయులగారు తెలంగాణ ఉద్యమాన్ని గురించి తెలంగాణ, వీర తెలంగాణ నాటకాలు రచించారు. అయితే వీరు తెలంగాణేతరులు అయినప్పటికీ తెలంగాణతో మమేకమై తెలంగాణ సామాజిక జీవితాన్ని ప్రతిబింబించిన నాటకాలు వ్రాసిన తెలంగాణా రచయితలు గానే భావించాలి.

చొల్లేటి నృసింహరామశర్మ "భిషగ్విజయం" నాటకం శర్మగారికి విశేష ఖ్యాతిని తెచ్చిపెట్టింది. దానితో ఉత్తేజితుడై "చ్యవన ప్రాశ" అనే నాటకాన్ని వ్రాసారు. ఈ నాటకం కూడా వైద్య శాస్త్రానికి సంబంధించినదే. జటిలమైన ఆయుర్వేద తాత్విక విషయాలు శర్మ గారి భావనలో విశిష్టమైన పాత్రలుగా మలచబడ్డాయి.

'భిషగ్విజయం' నాటకమయినప్పటికీ ఈ నాటకంలోని పాత్రలన్నీ మానవుని పీడించే విభిన్న వ్యాధులు. అంతేకాక ఆయుర్వేద శాస్త్రంలోని అష్టాంగాల విషయాలనేకములు ఈ నాటకంలో వివరించాలనే రచయిత ప్రధాన ఉద్దేశ్యం. ఈ నాటకంలో వ్యాధులపై వైద్యుడు సాధించిన విజయాన్ని సహేతుకంగా రూపకల్పన చేసి రచయిత ఈ నాటకానికి భిషగ్విజయమనెడి సార్థకమైన నామకరణం చేసారు. వ్యాధుల్ని పాత్రలుగా రూపొందించటమే కాక వైద్యశాస్త్రంలోని ఎన్నో నిగూఢ విషయాల్ని కూడ ఇందులో ఉటంకించడం జరిగింది.

భిషక్కు అంటే వారణాసి నివాసి ధన్వంతరి స్వరూపుడైన చికిత్సకుడు అని అర్థం. చికిత్సాచార్యుడు ఈ నాటకంలో మానవ కళ్యాణార్థమై, వ్యాధుల్ని రూపుమాపి తన ఆచార్యత్వాన్ని సార్థకం చేసుకుంటాడు. కాబట్టి ఈ నాటకానికి భిషగ్విజమము అని పేరు పెట్టడం ఔచిత్యంగా ఉంది. వ్యాధుల్ని పాత్రలుగా ప్రయోగించడం వినూత్నమైన ప్రయోగం అనే చెప్పాలి.

"ఒక రూపాయి" అనే నాటకాన్ని రచయిత వనం మదుసూదన్ డబ్బు విలువను, ఆర్థిక భద్రతను వ్యక్తి, సమాజపరంగా తెలియజేస్తూ సామాజిక ఇతివృత్తం నేపథ్యంతో రసవత్తరంగా తీర్చిదిద్దారు. సమాజంలో "డబ్బులేని వాడు డుబ్బుకు కొరగాడు" అన్న మాటను రచయిత ఈ నాటకం ద్వారా ఋజువు చేసినట్లు మనకనిపిస్తుంది.

శ్రమనేది చేయకపోతే మనిషి జీవితం చెల్లని రూపాయే అవుతుందని రచయిత తెలియచేసారు. రూపాయి సంపాదించాలంటే ఎంతగా కష్టపడాలి. ఆ కష్టపడిన రూపాయి ఎందుకంత తృప్తినిస్తుంది. మరే విధంగా సంపాదించినా అదే రూపాయి మానసికంగా వ్యధకు గురి చేస్తుంది అనే విషయాలను ప్రధానంగా తీసుకొని సన్నివేశాలను రూపకల్పన చేసి దాని కనుగుణంగా పాత్రలను ప్రవేశపెట్టి రచయిత ఈ నాటకానికి పరిపూర్ణత్వాన్ని తీసుకొచ్చారు. కేవలం ఆర్థికాభివృద్ధి, మానసిక వికాసానికి, మానవ జాతి అభ్యుదయానికి పరిపూర్ణ విజయం కాదని, కేవలం మానవ జీవిత గమనంలో ఒక పార్శ్వమని రచయిత ఈ నాటకం ద్వారా తెలియజేసినట్లు అనిపిస్తుంది.

దేశ ఆర్థిక పురోభివృద్ధికి దేశంలో ఉండేవాళ్ళందరూ కష్టపడాలని, కష్టపడి, చెమటోడ్చి సంపాదించిన రూపాయే తృప్తిని, ఆనందాన్ని ఇస్తుందనే సందేశాన్ని రచయిత ఈ నాటకంలో ప్రధాన సందేశంగా తెలియజేసినట్లు స్పష్టమవుతుంది.

మనిషి అంతరాంతరాల్లో ఉన్న భయం దాన్ని అంటిపెట్టుకుని ఉన్న లాభం ఏ విధంగా అతని జీవితంపై ప్రభవం చూపుతుందో తెలియజేస్తూ అరిషడ్వర్గాలే మనిషిని వెంటాడే నీడలనీ, వానిని తప్పించుకొంటే మనిషి మహామనిషి అవుతాడని "వెంటాడే నీడలు" నాటకం ద్వారా రచయిత డా॥ పి.వి. రమణ ఋజువు చేసారు. ఆకు రాలిన వసంతం 'రమణ గారు రచించిన మరో ఉత్తమ నాటకం.

వ్యాస పరిమితి దృష్ట్యా ఎన్నో ఉత్తమ నాటకాలను విశ్లేషణ చేయటం సాధ్యం కానందున వ్యాసాన్ని ఇంతటితో ముగిస్తున్నాను.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగులో చారిత్రక నాటకాలు (మొదటి భాగం) – డా॥ పి. వెంకటరామశాస్త్రి, జాతీయ సాహిత్య పరిషత్ ప్రచురణ – నారాయణ గూడ, హైదరాబాద్, జులై, 2005.
2. తెలుగు సాంఇక నాటకం – పరిణామ వికాసం – డా॥ పి.వి. రమణ వెంకట రమణ బ్రదర్స్ – పబ్లిషర్స్ & బుక్ సెల్లర్స్ – హైదరాబాద్, తెనాలి, వరంగల్ – 1995.
3. తెలంగాణ – తెలుగు మాగాణం – డాక్టర్ గుమ్మన గారి బాలి శ్రీనివాసమూర్తి, జీడిమెట్ల (గ్రామం) సికిందరాబాద్ – 55
4. తెలంగాణ నాటక వికాసం – పి.హెచ్.డి. సిద్ధాత గ్రంధము ఆ॥ తిరుణహరి చక్రధరస్వామి, తెలుగు శాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు.
5. తెలగాణ పోరాటం – నాటక చైతన్యం (వ్యాసం) – డా॥ బి.ఎస్. కామేశ్వరి "సత్కృతి" గన్నమరాజు గరిజా మనోహర్ బాబు – షష్ఠి పూర్తి అభినందన సంచిక, షష్ఠి పూర్తి, అభినందన సమితి – హనుమకొండ – జనవరి, 2012.
6. ఆంధ్ర వాఙ్మయ చరిత్రము – డా॥ దివాకర్ల వెంకటావధాని
7. తెలుగు నాటక వికాసము– డా॥ పి.యస్.ఆర్. అప్పారావు.
8. ఆంధ్ర నాటక రంగ వికాసం – మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి.
9. వ్యాస లహరి – డా॥ హరి శివకుమార్.